సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం • 26 • జూన్ • 2024



ఎన్ని'కలే'నా..?

పారిశ్రామిక ప్రాంతమైనప్పటికీ.. మున్సిపల్ పాలకవర్గం ఎన్నికలు లేక పాల్వంచ పట్టణం అభివృద్ధిలో వెనుకబడుతోంది. 8లో



.. జింకల సంతతి అంతంతే

కిన్నెరసాని అభయారణ్యంలో పెంచుతున్న మూషిక జింకలు ఇక్కడి వాతావరణ పరిస్థితులను తట్టుకోలేకపోతున్నాయి. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 32° / 25°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ మొదలై గంటగంటకూ పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

రామయ్య సన్నిధిలో రిటైర్డ్ మేజర్ జనరల్

రిటైర్డ్ మేజర్ జనరల్, రాష్ట్ర ఎల్‌డబ్ల్యూఎఫ్ విభాగం సలహాదారు ఆర్‌కే సింగ్ మంగళవారం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అంతరాలయంలో స్వామివారి దర్శనానంతరం లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో వేద పండితులు ఆశీర్వదించి, స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు. ఆయన వెంట ఏఎస్పీ పరితోష్ పంకజ్ తదితరులు ఉన్నారు. కాగా, ఏపీలోని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ఎన్ రాజు దంపతులు కూడా స్వామివారిని దర్శించుకున్నారు.

పౌష్టికాహారం అందిస్తున్నాం

కలెక్టర్ జితేష్ వి పాటిల్



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో పోషక లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారి ఎదుగుదలకు దోహదపడేలా పౌష్టికాహారం అందిస్తున్నామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పౌష్టికాహారం అందించేందుకు ప్రణాళికాయుతంగా చర్యలు తీసుకుంటున్నామని, బాలామృతం అందజేస్తున్నామని వివరించారు. బాలామృతం వినియోగించిన పిల్లల్లో మంచి ఫలితాలు కనిపిస్తున్నాయని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా సంక్షేమాధికారి విజేత తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సర్టిఫికెట్ల పరిశీలన

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్ర సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పాలిసెట్ – 24లో ర్యాంక్ సాధించి, మొదటి విడతలో ఆన్‌లైన్ చేసుకున్న విద్యార్థులకు కొత్తగూడెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారం ముగిసింది. ఈనెల 22 నుంచి 25 వరకు మొత్తం 850 మంది విద్యార్థులు హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ బి.నాగమునినాయక్ తెలిపారు. వీరంతా సీటు కేటాయింపు కోసం ఈనెల 27న స్లాట్ బుక్ చేసుకుని ఆప్షన్ పెట్టుకుంటే 30వ తేదీన సీట్లు కేటాయిస్తామని వివరించారు.

జీసీసీ బంక్‌ను త్వరలో పునరుద్ధరిస్తాం



మూతపడిన పెట్రోల్ బంక్

పాల్వంచరూరల్ : ములకలపల్లి మండల కేంద్రంలో ఏడాదిన్నర క్రితం మూతబడిన జీసీసీ పెట్రోల్ బంక్‌ను మరో వారం, పది రోజుల్లో పునరుద్ధరిస్తామని పాల్వంచ బ్రాంచ్ జీసీసీ మేనేజర్ లక్ష్మాజి తెలిపారు. ఐటీసీఎల్ సేల్స్‌మెన్ ప్రసాద్‌తో కలిసి మంగళవారం ములకలపల్లిలోని బంక్‌ను పరిశీలించామని చెప్పారు. బంక్ నిర్వహణతో రూ.94 లక్షల మేర నష్టం రావడంతో మూసేశామని తెలిపారు. పునరుద్ధరించేందుకు రూ.30 లక్షలు అవసరమని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు. ప్రస్తుతం మరమ్మతు పనులు చేపడుతున్నామని తెలిపారు.

మందులిచ్చే నాథులేరి ?



ఒకే డాక్టర్ ఉన్న రేగళ్ల పీహెచ్‌సీ



జిల్లాలో అత్యధికం ఏజెన్సీ ప్రాంతం. అటవీ ప్రాంతాల్లో మారుమూలన ఆవాసాలు ఏర్పాటు చేసుకుని జీవించే ఆదివాసీలే ఎక్కువ. వర్షాకాలం వచ్చిందంటే దోమలు విజృంభించడం, సీజనల్ వ్యాధులు రావడం ఇక్కడ సర్వసాధారణం. అక్కడి ప్రజలకు పట్టణాలకు వచ్చి ప్రైవేటు వైద్యం చేయించుకునే స్థోమత ఉండదు. అందితే సర్కారు వైద్యం.. లేదంటే ఆకు పసర్లే ఆధారం. అలాంటి వారికి వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం అన్ని మండల కేంద్రాల్లో పీహెచ్‌సీలు, పలు చోట్ల పల్లె దవాఖానాలు ఏర్పాటు చేసింది. అయితే ఆయా ఆస్పత్రుల్లో పోస్టులు భర్తీ చేయకపోవడంతో మందులు ఇచ్చే నాథుడు లేక ఏజెన్సీ వాసులు ఇబ్బంది పడుతున్నారు. సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారు. – కొత్తగూడెంరూరల్

జిల్లాలో 81 డాక్టర్ పోస్టులు ఖాళీ

- 24 గంటల పీహెచ్‌సీల్లో 15.. పల్లె దవాఖానాల్లో 27..
- వైద్య విధాన పరిషత్‌లో 39 మంది కొరత
- ఏజెన్సీ ప్రజలకు గగనమవుతున్న వైద్య సేవలు

ఖాళీలే ఖాళీలు..

జిల్లాలో వైద్యారోగ్య శాఖ, వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో పలు డాక్టర్ పోస్టులు ఖాళీలు ఉన్నాయి. జిల్లాలో 29 పీహెచ్‌సీలు, ఐదు యూపీహెచ్‌ఎస్‌లు, నాలుగు అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్లు ఉండగా.. ఇందులో 15 పీహెచ్‌సీలు 24 గంటలూ పని చేస్తాయి. అయితే అందులో చంద్రుగొండ, దమ్మపేట, గుమ్మడవల్లి, గుండాల, మంగపేట, రేగళ్ల, సులానగర్, సత్యనారాయణపురం పీహెచ్‌సీల్లో ఒక్కొక్కరు చొప్పున మాత్రమే డాక్టర్లు ఉన్నారు. వారు విధుల నుంచి వెళ్లిపోయాక నర్సులే వైద్య సేవలు అందించాల్సి వస్తోంది. ఆయా పీహెచ్‌సీల పరిధిలో 25 వేల నుంచి 30 వేల మందికి సేవలు అందాల్సి ఉంది. ఇవన్నీ మారుమూల ప్రాంతాలు కావడం, ఒక్కరే వైద్యులు ఉండడంతో తమ నాడి పట్టే వారే కరువయ్యారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ సమస్య ఉన్నా పోస్టులు భర్తీ చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక రాత్రి వేళల్లో అయితే సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా ఉన్నాయి. ఇక కరకగూడెం, గుడిపాడు పీహెచ్‌సీల్లో వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో పక్కనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు వచ్చి సేవలు అందిస్తున్నారు. ఇక జిల్లా వైద్యారోగ్య శాఖలో 65 వైద్య పోస్టులు ఉండగా 47 మంది మాత్రమే పని చేస్తున్నారు. మరో ముగ్గురు కాంట్రాక్ట్ వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. 15 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు ఇటీవలే ప్రభుత్వానికి నివేదిక పంపించారు.

పల్లె దవాఖానాల్లోనూ కొరతే..

జిల్లాలోని గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో గత ప్రభుత్వం పల్లె దవాఖానాలను ఏర్పాటు చేసింది. అయితే జిల్లాలో 27 పల్లె దవాఖానాల్లో డాక్టర్లు లేరు. దీంతో కొన్ని మూసే ఉంటున్నాయి. ఈ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించినప్పటికీ ఇంకా ప్రక్రియ పూర్తి కాలేదు.

మంచం పట్టకముందే చర్యలు చేపట్టండి..

రానున్నది వర్షాకాలం సీజన్. మిగతా రోజుల కంటే ఈ సమయంలో వ్యాధులు అధికంగా ప్రబలుతాయి. నీరు నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెందడం, అపరిశుభ్రత వంటి కారణాలతో వ్యాధులు సంక్రమిస్తుంటాయి. ఈ తరుణంలో పల్లె ప్రజలు మంచాన పడకముందే అధికారులు ముందస్తు చర్యలు చేపట్టి వైద్యుల పోస్టులు భర్తీ చేయాలని, మారుమూల ప్రాంతాల్లోనూ మెరుగైన సేవలు అందించాలని పలువురు కోరుతున్నారు. గతేడాది వానాకాలంలో మలేరియా, డెంగీ జ్వరాలు విజృంభించాయి. ప్రభుత్వ వైద్యం అరకొరగానే ఉండడంతో కొందరు వేల రూపాయలు వెచ్చించి ప్రైవేటు ఆస్పత్రుల బాట పట్టారు.

వైద్యవిధాన పరిషత్‌లో 39..

జిల్లాలోని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో 39 డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాల్వంచ, భద్రాచలం, ఇల్లెందు, మణుగూరు, అశ్వారావుపేట ఆస్పత్రుల్లో 24 రెగ్యులర్ పోస్టులు, 15 కాంట్రాక్ట్ వైద్యుల పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం ఉంది.

ముందస్తు చర్యలు చేపడతాం



జిల్లాలో ఎవరికైనా జ్వరం వస్తే ఆర్‌ఎంపీల వద్దకు కాకుండా పల్లె దవాఖానాలు, పీహెచ్‌సీలకు వెళ్లాలి. అక్కడ మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తాం. పోస్టుల భర్తీకి చర్యలు చేపడతాం. జిల్లాలో 171 సమస్యాత్మక గ్రామాల్లో దోమలమందు పిచికారీ చేయిస్తున్నాం. అన్ని హాస్టళ్లలోనూ మందు స్ప్రే చేస్తాం. విద్యార్థులకు ముందస్తుగా వైద్య పరీక్షలు నిర్వహిస్తాం. వరద ముంపు ప్రాంతాలైన చర్ల, దుమ్ముగూడెం, బూర్గంపాడు, భద్రాచలం, మణుగూరు, పినపాక తదితర ప్రాంతాల వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశాం.

– భాస్కర్‌నాయక్, డీఎంహెచ్‌ఓ

గిరిజనాభివృద్ధికి కృషి చేస్తా

- ఏజెన్సీలో సేవ చేయాలనే తపనతోనే ఇక్కడికి వచ్చా
- విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తా
- ఐటీడీఏ నూతన పీఓ రాహుల్



మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలం : ఏజెన్సీ ప్రాంత గిరిజనుల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ వెల్లడించారు. మంగళవారం ఆయన పీఓగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేకంగా ఏజెన్సీ ఏరియాలో పని చేయాలనే తపనతోనే భద్రాచలం వచ్చానని చెప్పారు. మంచిర్యాలలో పనిచేసిన సమయంలో ఉట్నూరు ఐటీడీఏ పరిధిలో కొన్ని గ్రామాల్లో పరిపాలనా అనుభవం ఉందని తెలిపారు. గిరిజనులకు విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని, గతంలో పనిచేసిన చోట విద్యా రంగంలో కీలక మార్పులకు ప్రణాళిక అమలు చేశానని వివరించారు. ఆ అనుభవంతో గిరిజన విద్యార్థులకు మెరుగైన బోధన అందించి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు వచ్చేలా చూస్తానని తెలిపారు. ప్రాథమిక స్థాయి నుంచి విద్యారంగ బలోపేతానికి దిశానిర్దేశం చేస్తానని అన్నారు. అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్ పెంచి, గిరిజనులకు ఆర్థిక స్వావలంబన చేకూరేలా జీసీసీని అభివృద్ధి చేస్తామని చెప్పారు. ట్రైనీ ఐఏఎస్‌గా ఉన్నప్పుడు భద్రాచలంలో వారం రోజులు, ఆ తర్వాత ఖమ్మం జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా పని చేసిన తనకు ఈ ప్రాంతంతో అనుబంధం ఉందని గుర్తు చేశారు.

పీఓకు ఘన స్వాగతం..

ఐటీడీఏ నూతన పీఓగా బాధ్యతలు స్వీకరించేందుకు మంగళవారం భద్రాచలం వచ్చిన రాహుల్‌కు ఐటీడీఏ అధికారులు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ భీమ్, గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, ఆర్‌ఓఎఫ్ఆర్ డీటీ శ్రీనివాస్, ఎస్‌ఓ సురేష్‌బాబు, గురుకుల ఆర్‌సీఓ వెంకటేశ్వర్ రాజు, ఏసీఎంఓ రమణయ్య, ఏడీ భాస్కర్, ఎఫ్‌డీసీ అశోక్, జేడీఎం హరికృష్ణ, మేనేజర్ ఆదినారాయణ, డీఎస్‌ఓ ప్రభాకర్ రావు, ఏపీఓ మునీర్ పాషా, ఏటీడీఓ నరసింహారావు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన ఉండాలి

ఎస్పీ రోహిత్‌రాజ్



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెంటౌన్: కొత్త చట్టాలపై ప్రతీ పోలీసుకు అవగాహన ఉండాలని, అప్పుడే ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించే అవకాశం ఉంటుందని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. కొత్తగూడెం సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ సిబ్బంది, అధికారులకు మంగళవారం స్థానిక సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్) భారతీయ సాక్ష్యా అధినియం (బీఎస్ఏ) చట్టాలు దేశ వ్యాప్తంగా జూలై 1 నుంచి అమలవుతున్నాయని, వీటిపై అందరికీ అవగాహన అవసరమని అన్నారు. ప్రతీ ఒక్కరిలో నేర్చుకోవాలనే తపన ఉంటేనే అవగాహన సాధ్యమన్నారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, సీఐలు ఇంద్రసేనారెడ్డి, కరుణాకర్, వెంకటేశ్వర్లు, శివప్రసాద్, ఎస్సైలు రాణాప్రతాప్, విజయ, రవి, రాజేష్, సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్య తప్పదు

జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు



ఓ దుకాణంలో తనిఖీ చేస్తున్న బాబూరావు తదితరులు


కరకగూడెం : రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే ఎరువుల దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, లైసెన్స్ రద్దుచేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.బాబూరావు హెచ్చరించారు. పినపాక మండలంలోని పలు ఎరువుల దుకాణాలను మంగళవారం ఆయన తనఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు కొనుగోలు చేసే ప్రతీ వస్తువుకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని, ఎమ్మార్పీకే మందులు విక్రయించాలని సూచించారు. అనంతరం స్టాక్ రిజిస్టర్, లైసెన్స్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో పినపాక, కరకగూడెం మండలాల ఏఓలు వెంకటేశ్వర్లు, సాయిసతన్, పినపాక ఏఈఓ కొమరం లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్‌పై అవగాహన కల్పించండి

డీఈఓ వెంకటేశ్వరాచారి

కొత్తగూడెంటౌన్: ప్రజారోగ్య సమస్యగా ఉన్న సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరాచారి సూచించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కేజీబీవీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు సికిల్ సెట్ అనీమియా, ఇతర రక్త సంబంధ వ్యాధులకు గురికాకుండా చైతన్యం చేయాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఆశ్రమ, ప్రైవేటు పాఠశాలల్లో బుధవారం ఉదయం ప్రార్థన సమయంలో ఈ వ్యాధిపై అవగాహన కల్పించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. 27న గ్రామాల్లో మహిళా సమాఖ్యల ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని, 28న అన్ని గ్రామపంచాయతీల్లో ర్యాలీలు చేయాలని సూచించారు. 29న అన్ని పాఠశాలల్లో క్విజ్ పోటీలు నిర్వహించాలని సూచించారు. తిరిగి 30వ తేదీన పాఠశాల విద్యార్థులతో గ్రామాల్లో ర్యాలీ నిర్వహించాలని, 31 వ్యాసరచన పోటీలు, జూలై 1న పాఠశాలల్లో సికిల్‌సెల్‌పై నాటిక పోటీలు, 3వ తేదీన అన్ని గ్రామాల్లో అవగాహన ర్యాలీలు చేయాలని కోరారు.

ఆకాశమే అరుణబింబమై..



సాయం సంధ్య వేళ వినీలాకాశం అరుణబింబాన్ని సాక్షాత్కరించింది. ములకలపల్లి మండల కేంద్రంలో సూర్యాస్తమయ సమయాన గగనంలో ఇలా పలురంగులతో అందరి దృష్టినీ ఆకర్షించగా.. ఈ సుందర దృశ్యాన్ని 'సాక్షి' కెమెరా బంధించింది.

– ములకలపల్లి

సన్నాల సాగుకే సై..

- జిల్లాలో పెరగనున్న సన్న రకం వరి
- క్వింటాకు రూ.500 బోనస్‌తో రైతుల ఆసక్తి
- 1.40 లక్షల ఎకరాల్లో సాగయ్యే అవకాశం



సన్నరకం వరి సాగుకు సిద్ధంగా ఉన్న నారు

బూర్గంపాడు: ఈ వానాకాలం సీజన్‌లో జిల్లాలో సన్నరకం వరి సాగు గణనీయంగా పెరగనుంది. ఇప్పటికే రైతులు సన్నరకం వరి విత్తనాలను కొనుగోలు చేసి నార్లు పోసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం క్వింటాకు రూ. 500 బోనస్ ప్రకటించడంతో రైతుల్లో ఉత్సాహం నిండింది. అంతేకాక మిల్లర్లు, వ్యాపారులు సైతం ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకే ఆసక్తి కనబరుస్తుండడంతో రైతులు ఆ పంట సాగుకే మొగ్గు చూపుతున్నారు. గత వానాకాలం సీజన్‌లో ఇతర రాష్ట్రాల మిల్లర్లు, వ్యాపారులు కూడా సన్నరకం ధాన్యం కొనుగోలుకు పోటీ పడ్డారు. రైతులు పంటకోసి, కుప్పలు పోస్తే చాలు.. కళ్లాల వద్దకే ఉరుకులు, పరుగులతో వచ్చి పచ్చి ధాన్యాన్నే కొన్నారు. ప్రభుత్వ మద్దతు ధర కంటే అధికంగా చెల్లించారు. తేమ శాతాన్ని సైతం పట్టించుకోకుండా క్వింటా రూ. 2,500 చొప్పున కొనుగోలు చేశారు. దీంతో గత వానాకాలం సీజన్‌లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు 5 శాతం కూడా సన్నరకం ధాన్యం రాలేదు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ప్రభుత్వం ఈ ఏడాది సన్నరకం పండించే రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించింది. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం కూడా ధాన్యం మద్దతు ధర క్వింటాకు రూ.117 పెంచింది. కేంద్రం పెంచిన మద్దతు ధరతో క్వింటాకు రూ. 2,330 దక్కనుండగా, రాష్ట్ర ప్రభుత్వ బోనస్‌తో కలిపితే రైతులకు సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ. 2,830 లభించే అవకాశాలు ఉన్నాయి.

రైతులను ప్రోత్సహించేందుకే..

రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేసే దొడ్డు రకం బియ్యం తినేందుకు ప్రజలు ఇష్టపడటం లేదు. రేషన్ బియ్యం రీ సైక్లింగ్‌కు అదే ప్రధాన కారణమని ప్రభుత్వం భావిస్తోంది. ఇక ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో కూడా సన్నరకం బియ్యమే అందించాలని నిర్ణయించారు. దీంతో సన్నరకం ధాన్యం పండించేలా రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం బోనస్ ప్రకటించింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ 31 రకాల సన్నరకం వరి వంగడాలు సాగు చేయాలని రైతులకు సూచించింది. వీటిలో ఏది పండించినా బోనస్ దక్కుతుందని ప్రకటించింది.

చీడ పీడల సమస్య అధికం..

సన్నరకం వరిసాగు చేస్తే రైతులు పలు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ పంటకు చీడపీడల సమస్య అధికం. పొట్టదశలో ఉన్న పంటకు దోమపోటు ఎక్కువగా వస్తుంది. ఈ సమయంలో తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు తీసుకోకుంటే దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం ఉంటుంది. అదే దొడ్డు రకం వరి సాగు చేస్తే పెట్టుబడి ఖర్చులు తక్కువగా ఉంటాయి. ఈ ధాన్యం ఎకరానికి 35 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వస్తుండగా.. సన్నరకాలైతే 30 నుంచి 35 బస్తాల దిగుబడి మాత్రమే వస్తుంది. అయితే ప్రభుత్వం బోనస్ ప్రకటించటం, మార్కెట్‌లో సన్నరకాలకు డిమాండ్ ఎక్కువగా ఉండడంతో ఈ ఏడాది రైతులు సన్నరకం వరి సాగుకే మొగ్గుచూపుతున్నారు.

అమ్ముకోవడం సులభం



సన్నరకం ధాన్యానికి మార్కెట్‌లో డిమాండ్ ఉంది. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ. 500 బోనస్ ప్రకటించింది. దిగుబడి తగ్గినా మార్కెట్‌లో వెంటనే కొనుగోలు చేస్తున్నారు. అమ్ముకోవడం సులువు కాబట్టే సన్నరకం ధాన్యాన్నే పండిస్తున్నాం. దొడ్డు రకం ధాన్యమైతే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాల్సి వస్తోంది. అక్కడ తేమ శాతం తక్కువగా ఉంటేనే కొనుగోలు చేస్తారు. ధాన్యాన్ని ఆరబెట్టడం, తూర్పారా బట్టడం వంటి ఇబ్బందులూ ఉంటాయి. ఆ కష్టాలు పడలేకే సన్న రకాలు సాగు చేస్తున్నాం.

యదమకంటి రవీందర్‌రెడ్డి, రైతు

రైతులను ప్రోత్సహిస్తున్నాం



సన్నరకం వరి సాగు చేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నాం. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం క్వింటాకు రూ. 500 బోనస్ అందిస్తుంది. ప్రభుత్వం 31 రకాల సన్నరకం వరి వంగడాలు సాగు చేసుకోవాలని రైతులకు సూచించింది. రైతులు కూడా సన్నరకం వరి సాగుకే ఆసక్తి చూపుతున్నారు.

– తాతారావు, ఏడీఏ, మణుగూరు

155 పోస్టులు.. 5,200 దరఖాస్తులు

- నిరుద్యోగ సమస్యకు అద్దం పట్టిన వైనం
- కిక్కిరిసిన కలెక్టరేట్



దరఖాస్తు చేసేందుకు తరలివచ్చిన అభ్యర్థులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రభుత్వ వైద్య కళాశాలలోని 23 విభాగాల్లో 155 ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించగా 5,200 మంది అప్లికేషన్లు పెట్టుకున్నారు. చివరి రోజైన మంగళవారం కలెక్టరేట్‌కు వచ్చిన వారిని చూస్తే నిరుద్యోగ సమస్యకు నిలువుటద్దంగా మారిందని పలువురు చర్చించుకున్నారు. అభ్యర్థులతో దరఖాస్తు స్వీకరణ హాల్ కిక్కిరిసిపోయింది. ఇక దరఖాస్తులకు జతచేసే సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలపై గెజిటెడ్ అధికారి సంతకం చేయించాలనే నిబంధనతో పలువురు ఇబ్బందులకు గురయ్యారు. సంతకం చేయాలంటే ఒరిజినల్ సర్టిఫికెట్లు చూపించాలని గెజిటెడ్ అధికారులు చెప్పడంతో అవి అందుబాటులో లేక తిప్పలు పడ్డారు. ఒకరు ఒక పోస్టుకు మాత్రమే దరఖాస్తు చేయాలని అధికారులు సూచించడంతో తొలుత అభ్యర్థులు నిరసన వ్యక్తం చేసినా.. చివరకు అలాగే సమర్పించారు.

క్లుప్తంగా

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



వీసీలో పాల్గొన్న అధికారులు, రైతులు

ములకలపల్లి: రైతులకు వ్యవసాయశాఖ ద్వారా అందిస్తున్న సలహాలు, సూచనలు పాటించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించాలని రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యాలయ శాస్త్రవేత్తలు సూచించారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ములకలపల్లి రైతువేదికలో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వారు మాట్లాడారు. వర్షాకాలంలో పంటల సాగు, చీడపీడల నివారణ తదితర అంశాలపై సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. విత్తన, పురుగుల మందుల విషయంలో రైతులకు ఆర్థికంగా సాయం అందించే విధంగా రాష్ట్రస్థాయిలో విధివిధానాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఎంఏఓ కరుణామయి, మండల వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీని సందర్శించిన రైతు నాయకులు



ఫ్యాక్టరీ మేనేజర్‌తో రైతు సంఘం నాయకులు

దమ్మపేట: మండలంలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని అశ్వారావుపేట జోన్ ఆయిల్‌పాం గ్రోవర్స్ సొసైటీ రైతు సంఘం నాయకులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ మేనేజర్ కళ్యాణ్‌గౌడ్‌ను కలిసి ప్లాంట్‌లో ఉత్పత్తవుతున్న విద్యుత్, ఆయిల్ రికవరీ శాతం, ఎంఈఈ ప్లాంట్ పౌడర్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య, తుంబూరు మహేశ్వరరెడ్డి, దొడ్డా లక్ష్మీనారాయణ, మోరంపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్




పట్టుబడిన వాహనాలతో డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు

ఇల్లెందు: నంబర్ ప్లేట్ లేకుండా నడుపుతున్న వాహనాలపై స్థానిక పోలీసులు మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈమేరకు 26 వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. అనంతరం వాహనదారులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు ప్లేట్ అమర్చి జరిమానా విధించారు. ప్రతీ వాహనదారుడు నంబర్ ప్లేట్‌తో పాటు బీమా, లైసెన్స్, వాహన పేపర్లు తమ వెంట ఉంచుకోవాలని డీఎస్పీ ఎన్.చంద్రభాను సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్‌ఐ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం.. ఇల్లెందులో ప్రత్యక్షం

బూర్గంపాడు: మండల కేంద్రంలోని గురుకుల బాలికల పాఠశాలలో గత నాలుగు రోజుల క్రితం ఐదో తరగతిలో చేరిన ఓ విద్యార్థిని మంగళవారం అదృశ్యమైంది. ఆతర్వాత ఆమె తల్లిదండ్రులకు ఇల్లెందు బస్టాండ్‌లో ప్రత్యక్షమైంది. వివరాల్లోకి వెళితే.. గురుకుల బాలికల పాఠశాలలో చేరిన విద్యార్థిని లౌక్యశ్రీ మంగళవారం స్కూల్ నుంచి అదృశ్యమైంది. దీంతో పాఠశాల ప్రిన్సిపాల్ తాతారావు విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారమిచ్చి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అనంతరం ఓవైపు పాఠశాల సిబ్బంది, మరోవైపు విద్యార్థిని తల్లిదండ్రులు వెతుకుతుండగా.. ఇల్లెందు బస్టాండ్‌లో తల్లిదండ్రులకు కనిపించింది. దీంతో విద్యార్థినిని పాఠశాలకు తీసుకొచ్చారు. ఇంటిపై బెంగతో లౌక్యశ్రీ పాఠశాల నుంచి వెళ్లిపోయినట్లుగా తెలిసింది. ఆతర్వాత ఇచ్చిన ఫిర్యాదును వాపస్ తీసుకున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

పోగొట్టుకున్న ఫోన్లు అప్పగింత



ఫోన్లు అందిస్తున్న సీఐ సత్యనారాయణ, తదితరులు

ఇల్లెందు: వివిధ చోట్ల పోగొట్టుకున్న ఫోన్‌లను పోలీసులు మంగళవారం ట్రేస్ చేసి బాధితులకు అందజేశారు. ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో పోగొట్టుకున్న ఫోన్ బాధితులు ఫిర్యాదు చేయగా.. సీఈఐఆర్ యాప్ సాయంతో ట్రేస్ చేసి సీఐ బత్తుల సత్యనారాయణ పలువురి బాధితులకు అందజేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,438

ఎన్ని ‘కలే’నా..?



హైదరాబాద్ ధర్నా చౌక్ వద్ద ధర్నా చేస్తున్న గ్రీన్ ఎర్త్ సొసైటీ సభ్యులు (ఫైల్)

పేరుకే ద్వితీయ శ్రేణి పాల్వంచ మున్సిపాలిటీ

- 24 ఏళ్లుగా జరగని మున్సిపాలిటీ ఎన్నికలు
- అధికారుల పాలనతో నెట్టుకొస్తున్న వైనం
- కోర్టులో వివాదాలు ఉన్నాయనే సాకుతో అధికారుల తాత్సారం
- ఖరారు కాని వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ

పాల్వంచ: పారిశ్రామిక ప్రాంతంగా పేరున్న పాల్వంచ.. అభివృద్ధిలో మాత్రం వెనుకంజలో ఉంది. పేరుకు ద్వితీయ శ్రేణి మున్సిపాలిటీ కాగ, ఇక్కడ గత 24 ఏళ్లుగా ఎన్నికలు లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతుండడంలో సందేహం లేదు. పాలక వర్గ ఎన్నికలు లేకపోవడంతో అధికారులు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్న చందాన మారింది. ఇక ఇక్కడ పాలక వర్గాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రజల ఆకాంక్ష తీరడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా పాలక పక్షాలు మాత్రం ఈ విషయంపై స్పష్టత ఇవ్వడం లేదు. ఎన్నికల సమయాల్లో ఈ అంశాన్ని ఎవరి అవసరాలకు అనుగుణంగా వారు ఉపయోగించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నారు. ఇటీవల కాలంలో కొత్తగూడెం, పాల్వంచ జంట పట్టణాలను కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతామనే వార్తలు తెరమీదకు వస్తున్నారు. ఈక్రమంలో పాల్వంచ మున్సిపాలిటీకి ఇక భవిష్యత్తులో ఎన్నికల ప్రక్రియపై మీమాంస నెలకొంది.

వివాదాలు ఉత్తిమాటేనా?

అయితే పాల్వంచ ఏజెన్సీ, నాన్ ఏజెన్సీ అనే వివాదంతోనే మున్సిపాలిటీలో ఎన్నికలు జరగడం లేదని, అప్పట్లో ఒకరిద్దరు కోర్టుల్లో కేసులు వేయడంతో ఎన్నికల ప్రక్రియ ప్రభుత్వం నిలిపివేసింది. అయితే కాలక్రమేణ ఆ కేసులు ఇంకా కోర్టుల్లో పెండింగ్ లేవని తెలుస్తోంది. ఇటీవల పలు పార్టీల నేతలు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను ఆర్టీఏ ద్వారా కోరిన క్రమంలో స్పష్టమైందని పలువురు వాపోతున్నారు. ఎలాంటి కేసులు లేని క్రమంలో ఎన్నికల నిర్వహణపై ఎందుకు తాత్సారం చేస్తున్నారని ఈ విషయమై గతంలో అఖిల పక్ష నేతలు అనేక ఉద్యమాలు నిర్వహించారు. అంతేగాక యువతరం పార్టీ, గ్రీన్ ఎర్త్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యాన గతేడాది హైదరాబాద్ ధర్నా చౌక్ వద్ద ఆందోళన చేశారు. అయితే ఇక్కడి పాలకులు తమ ఆధిపత్యం తగ్గుతుందనే ఉద్దేశంతో ఎన్నికలు జరగకుండా చూస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

వార్డుల విభజన, రిజర్వేషన్లపై స్పష్టత కరువు..

ద్వితీయ శ్రేణి మున్సిపాలిటీగా ఉన్న పాల్వంచలో ఇప్పటి వరకు 24 వార్డులు ఉన్నాయి. వీటి పునర్విభజన చేయడంతో పాటు రిజర్వేషన్లపై స్పష్టత ఇస్తే ఇక్కడి మున్సిపల్ అధికారులు, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు లేఖ రాస్తే సరిపోతుందని తెలుస్తోంది. కానీ ఈ విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేకుండా తామే ఖరార్ చేయడం కుదరదని ఇక్కడి అధికారులు వాపోతుండడంతో ఎన్నికల విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడడం లేదని తెలుస్తోంది. ఇప్పటికైనా పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించి అభివృద్ధి మరింత వేగంగా నడిపించేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికలపై తాత్సారం..

రాష్ట్రంలోని పాల్వంచ, మణుగూరు, మందమర్రి మున్సిపాలిటీలకు మాత్రమే ఎన్నికలు లేకుండా నడుస్తున్నాయి. పాల్వంచ గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా 1987లో అప్‌గ్రేడ్ అయి అదే ఏడాది మార్చిలో ఎన్నికలు నిర్వహించారు. 1992 వరకు పాలక వర్గం ఉండగా.. ఆ తర్వాత మూడేళ్లు ఎన్నికలు జరగలేదు. తిరిగి 1995లో ఎన్నికలు నిర్వహించి 2000 సంవత్సరం వరకు పాలక వర్గం కొనసాగింది. ఆ తర్వాత నుంచి ఎన్నికల ఊసే లేదు. నాటి నుంచి అధికారుల పాలనలోనే కొనసాగుతుంది. దీంతో అభివృద్ధి పనులపై అజమాయిషీ లేక అభివృద్ధి పనుల్లో పర్యవేక్షణ, ప్రజలకు ఇచ్చే పారదర్శకత లోపించింది.

ఎన్నికలు నిర్వహించాలి..



మున్సిపాలిటీకి తక్షణమే ఎన్నికలు నిర్వహించాలి. గతంలో తమ పార్టీ ఆధ్వర్యాన పాల్వంచ, హైదరాబాద్‌లలో ఆందోళనలు చేపట్టాం. కొత్తగూడెంను కార్పొరేషన్ చేసి పాల్వంచను కలపడాన్ని వ్యతిరేకిస్తున్నాం. ఇక్కడ ఎన్నికలు పెట్టి స్థానికులకు న్యాయం చేయాలి.

– పోట్రు ప్రవీణ్, యువతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు

కుంటుపడిన అభివృద్ధి..



పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు లేక గత రెండున్నర దశాబ్దాలుగా అభివృద్ధి కుంటుపడిపోయింది. వార్డుల విభజన, రిజర్వేషన్ అంశాన్ని అధికారులు తేల్చి తక్షణమే ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలి. స్థానికుల చిరకాల వాంఛ నెరవేర్చాలి.

– బాడిశ భిక్షం దొర, ఆదివాసీ రాష్ట్ర నాయకుడు

అంగన్‌వాడీల అద్దెకు మోక్షం..

- విడుదలైన భవనాల అద్దె బకాయిలు
- సెప్టెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు విడుదల
- 758 సెంటర్లకు రూ.84.91 లక్షలు

సాక్షి ఎఫెక్ట్..

కొత్తగూడెంటౌన్: పది నెలలుగా అంగన్‌వాడీ కేంద్రాల అద్దె బకాయిలు చెల్లించకపోవడంతో కిరాయిలు చెల్లించాలంటూ టీచర్లపై ఓనర్లు ఒత్తిడి తెస్తుండగా.. ‘పెండింగ్‌లో అద్దె బిల్లులు’అనే శీర్షికతో ‘సాక్షి’ దినపత్రికలో ప్రచురితమైంది. ఈమేరకు స్పందించిన అధికారులు సోమవారం అంగన్‌వాడీ కేంద్రాల అద్దెలను విడుదల చేస్తూ.. వారి ఖాతాల్లో జమచేసినట్లు అధికారులు పేర్కొన్నారు. వివరాల్లోకి వెళితే.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన అద్దె బకాయిలు ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలోని 758 అంగన్‌వాడీ అద్దె భవనాలకు పది నెలల అద్దె బకాయిలకు గాను ఆరు నెలలకు సంబంధించి రూ.84,91,420లను ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లా ఐసీడీఎస్ పరిధిలో మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు మొత్తం 2,060 ఉండగా.. ఇందులో 782 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు, మరో 493 కేంద్రాలు ఉచిత భవనాలు ఉన్నాయి. కానీ ఇందులో 758 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అయితే గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఆరు నెలల బిల్లులు ఆయా ఖాతాల్లో జమ చేయగా.. మరో నాలుగు నెలల అద్దె చెల్లించాల్సి ఉందని అంగన్‌వాడీ టీచర్లు పేర్కొంటున్నారు.ఈ విషయమై జిల్లా సంక్షేమశాఖ అధికారి వేల్పుల విజేత వివరణ కోరగా.. జిల్లాలో 758 అద్దె భవనాలకు గాను 10 నెలలు అద్దె బకాయి ఉందన్నారు. ఇందులో ఆరు నెలలకు రూ.84.91 లక్షలు విడుదలయ్యాయని చెప్పారు.

విడుదలైన బకాయి వివరాలిలా..

నెల	బకాయి
సెప్టెంబర్	రూ.14,12,850
అక్టోబర్	రూ.14,14,850
నవంబర్	రూ.14,14,850
డిసెంబర్	రూ.14,16,850
జనవరి	రూ.14,17,010
ఫిబ్రవరి	రూ.14,17,010
మొత్తం	రూ.84,91,420

బొగ్గు గనుల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం



ర్యాలీలో పాల్గొన్న తమ్మినేని వీరభద్రం, సీపీఎం నాయకులు

- నీట్‌పై కేంద్రం స్పందించకపోవడం సిగ్గుచేటు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

కొణిజర్ల: కేంద్రప్రభుత్వం బొగ్గు గనుల వేలం ద్వారా ప్రైవేటీకరణకు చేస్తున్న ప్రయత్నాలను ఇండియా కూటమి ఆధ్వర్యాన అడ్డుకుంటామని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వెల్లడించారు. కొణిజర్ల మండలం చిన్నగోపతిలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న రాజకీయ శిక్షణా తరగతులను ఆయన మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని బొగ్గు గనులను సింగరేణికి అప్పగించేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో పోరాడాలన్నారు. అలాగే, ఏపీ – తెలంగాణ విభజన సమయంలో బయ్యారంలో ఉక్కు కర్మాగారం, కేంద్ర విద్యా సంస్థల ఏర్పాటుపై ఇచ్చిన హామీలను కేంద్రం అమలచేయాలని డిమాండ్ చేశారు. కాగా, నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై కేంద్రం నోరు మెదపక పోవడం సిగ్గుచేటని, ఇకనైనా అవినీతికి పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించి విద్యార్థులకు భరోసా కల్పించాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఎన్నికల సమయాన ఇచ్చిన ఆరు గ్యారంటీలను బేషరతుగా అమలు చేయాలన్నారు. రైతుబంధు, రుణమాఫీ రెండూ ఏక కాలంలో వర్తింపచేయడమే కాక వ్యవసాయ కార్మికులకు అమలు చేసిన కనీస వేతన చట్టాన్ని తీసుకురావాలని సూచించారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించగా సీపీఎం సీనియర్ సీపీఎం నాయకుడు కొప్పుల కృష్ణయ్య పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో నాయకులు పోతినేని సుదర్శన్, పిట్టల రవి, భూక్యా వీరభద్రం, తాళ్లపల్లి కృష్ణ, చెరుకుమల్లి కుటుంబరావు, బోయినపల్లి శ్రీనివాసరావు, అన్నారపు వెంకటేశ్వర్లు, చింతపల్లి ప్రసాద్, మోత్కూరి వెంకయ్య, లింగాల దానయ్య,దారగాని రాములు, మాధవరెడ్డి, వీరభద్రం, మహబూబ్ అలీ, మోహనరావు, రవి, విజయ, కుమారి, సరోజిని, అఫ్జల్, సాంబ పాల్గొన్నారు.

పోస్ట్‌మాస్టర్లకు అవార్డులు ప్రదానం



అవార్డు అందజేస్తున్న రమేష్‌నాయక్

పాల్వంచరూరల్: పోస్ట్ ఆఫీస్‌కు సంబంధించి వివిధ పథకాలలో 2023–2024 ఆర్థిక సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లకు అవార్డులు అందజేశారు. మంగళవారం స్థానిక సబ్ డివిజన్ పోస్టు ఆఫీస్ వద్ద జరిగిన కార్యక్రమంలో సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌నాయక్ అవార్డులను ప్రదానం చేశారు. పాల్వంచ సబ్ డివిజన్ పరిధిలోని పాల్వంచ, ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట మండలంలోని బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లలో పాల్వంచ మండలం పాండురంగాపురం బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ బండి ఎల్లారావు ప్రతిభ కనబర్చడంతో ప్రథమ బహుమతి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐపీపీబీ సీనియర్ మేనేజర్ రాజేష్, మేనేజర్ జగదీష్, పోస్ట్ మాస్టర్ ఉపేందర్, మెయిల్ ఓవర్సీస్ శేషు, సత్యనారాయణ పాల్గొన్నారు.

కల్వర్టును ఢీకొని ఆటో బోల్తా..

16 మంది కూలీలకు గాయాలు



కొత్తగూడెంరూరల్: బోల్తా పడిన ప్రాంతంలో క్షతగాత్రులు

కొత్తగూడెంరూరల్: కూలీలతో వస్తున్న ఆటో లక్ష్మీదేవిపల్లి మండలం మైలారం గ్రామ సమీపాన కల్వర్టు ఢీకొని బోల్తా పడడంతో 16 మందికి గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలిలా.. లక్ష్మీదేవిపల్లి మండలం పరిధిలోని చింతపెంటగూడెం, బంగారుచెలక గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు 16 మంది గట్టుమల్ల ప్రాంతంలో మొక్కజొన్న గింజలు వేయడానికి ఆటోలో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మైలారం గ్రామ సమీపాన ఉన్న కల్వర్టును ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న బొర్రా వీరబాబు, కోరం పార్వతి, చింత సుజాత, మలకం ఉమలకు తీవ్ర గాయాలు కాగా మిగిలిన 12 మందికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను కొత్తగూడెం సర్వజన ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈమేరకు క్షతగ్రాతులను జిల్లా కాంగ్రెస్ నాయకుడు తూము చౌదరి, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషాలు సందర్శించి పరామర్శించారు. కాగా, ఆటోలో ఎక్కువ మందిని ఎక్కించడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని తెలుస్తుంది. ఈ విషయమై లక్ష్మీదేవిపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

పెద్దవాగు బ్రిడ్జి వద్ద మరో ఆటో..

బూర్గంపాడు: సారపాక–నాగినేనిప్రోలు మధ్యన పెద్దవాగు బ్రిడ్జి సమీపాన మంగళవారం కూరగాయలతో వెళ్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటో డ్రైవర్‌కు, ఓ ప్రయాణికురాలికి స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఆటోను బయటకు తీయించారు.

నాటుసారా పట్టివేత

దుమ్ముగూడెం: నాటుసారా విక్రయిస్తూ పట్టుబడిన ఓ మహిళపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే మండలంలోని నర్సాపురం గ్రామంలో మంగళవారం ఓ మహిళ నాటుసారా విక్రయిస్తుంది. విషయం తెలుసుకున్న ఎక్సైజ్ ఎస్‌ఐలు సీతారామరాజు, సాయిరాంలు తమ సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నారు. ఈమేరకు ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐలుతెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటనపై మంగళవారం భద్రాచలం టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ పీవీఎన్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. శాంతినగర్ కాలనీకు చెందిన కాకర్ల ప్రసన్న ఈ నెల 20వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లి నేటి వరకు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో మంగళవారం ప్రసన్న భార్య ప్రేమాంజలి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు. కాగా, ప్రసన్నకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

దమ్మపేట: మండల పరిధిలోని నాచారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడి చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌ఐ సాయి కిషోర్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడి చేశారు. దీంతో నలుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,840 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాంగ్రెస్ వర్గీయుల మధ్య వాగ్వాదం

అశ్వారావుపేటరూరల్: అధికార పార్టీలోని పాత, కొత్త నాయకుల మధ్య మంగళవారం రాత్రి అశ్వారావుపేటలో తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ఎమ్మెల్యే ఆదినారాయణ ఆధ్వర్యాన మండలాల వారిగా నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి అశ్వారావుపేట మండలంలోని నాయకులతో చర్చిస్తుండగా.. రెండు రోజుల క్రితం స్థానిక పాత ఎంపీడీఓ కార్యాలయం వద్ద జరిగిన పాలాభిషేకం ఫ్లెక్సీలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఫొటో లేకపోవడంతో కొంత మంది నాయకులు పాత కాంగ్రెస్ నాయకులను నిలదీశారు. దీంతో మాటమాట పెరిగి కొత్త, పాత నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం జరుగగా.. కొంతకాలంగా నెలకొన్న విభేదాలు ఒక్కసారిగా బహిర్గతమయ్యాయి. ఇరు వర్గాల నాయకులు ఎమ్మెల్యే సమక్షంలోనే ఆరోపణలు చేసుకుంటూ దుర్భాషలాడడం విశేషం. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు అక్కడకు చేరుకొని ఇరువర్గాలను శాంతింపజేశారు.

విధుల్లో చేరిన డీసీసీబీ డీజీఎంలు, ఏజీఎంలు

ఖమ్మంవ్యవసాయం: కామన్ పూల్ విధానంలో సొంత జిల్లాకు బదిలీ అయిన సహకార బ్యాంక్ అధికారులు మంగళవారం ఖమ్మంలోని డీసీసీబీ కార్యాలయంలో విధుల్లో చేరారు. అలాగే, ఇక్కడి డీసీసీబీ నుంచి పలువురు అధికారులు రిలీవ్ అయి తమ సొంత జిల్లాలకు వెళ్లారు. రాష్ట్రవ్యాప్తంగా డీసీసీబీల్లో విధులు నిర్వర్తిస్తున్న వివిధ స్థాయి అధికారులు 68 మందిని బదిలీ చేస్తూ టస్కాబ్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు ఖమ్మం డీసీసీబీకి కేటాయించిన డిప్యూటీ జనరల్ మేనేజర్లు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు జి.ఉదయశ్రీ, జి.వేణుగోపాల్, ఎం.సర్వేశ్వర్‌రావు, బి.చందర్‌రావు, జి.ప్రవీణ్, కె.రాధిక, ఎ.కల్యాణి, కె.నవీన్ మంగళవారం రిపోర్ట్ చేయడంతో వారికి సీఈఓ అబీద్ ఉర్ రెహమాన్ సెక్షన్లు అప్పగించారు. ఇక ఖమ్మం డీసీసీబీలో పనిచేస్తున్న ఎస్.కిరణ్‌కుమార్, రాగినేని ఉపేందర్‌రావు, టి.అజయ్‌రెడ్డి, మధు సంది, గంప స్రవంతి, బి.కృష్ణమోహన్, పి.వెంకటేశ్వర్లును సొంత జిల్లాలకు బదిలీ చేయగా వారు రిలీవ్ అయ్యారు. అయితే, జనరల్ మేనేజర్లను కూడా త్వరలోనే కామన్ పూల్ విధానంలో బదిలీ చేయనుండగా, ఖమ్మం జీఎం కాకర్ల నర్మద నల్లగొండకు, నల్లగొండలో పనిచేస్తున్న వసంతరావు ఖమ్మం రానున్నారు.

పట్టపగలు బోర్డులు చోరీ..

ఇల్లెందు: పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద సైన్ బోర్డులను ఓ దుండగుడు పట్టపగలు చోరీకి పాల్పడ్డాడు. రాత్రి సమయాన బోర్డులు తొలగించి ఒక చోట దాచి పగటి పూట తరలిస్తుండగా.. ఆర్టీసీ అధికారులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పాల్వంచలో ఇసుక లారీ సీజ్

పాల్వంచ: అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని పట్టణ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మొర్రేడు వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని బీసీఎం రోడ్‌లోని లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్‌వద్ద పట్టణ ఎస్‌ఐ బి.రాము పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో లారీని సీజ్ చేసి యజమాని నాని, డ్రైవర్ సందీప్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

భద్రాచలంలో..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న ఇసుక లారీని పట్టణ పోలీసులు పట్టుకున్నారు. టౌన్ ఎస్‌ఐ పీవీఎన్ రావు కథనం ప్రకారం.. పట్టణంలోని ఫారెస్టు కార్యాలయం ఎదుట అక్రమంగా తరలించిన ఇసుకను లారీ డంప్ చేస్తోంది. ఈక్రమంలో లారీని పట్టుకుని స్థానిక స్టేషన్‌కు తరలించడంతో పాటు డ్రైవర్ సమ్మయ్య, లారీ యజమాని కోట నాగిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మనీ సర్క్యులేషన్‌పై క్షేత్రస్థాయిలో ఆరా

నేలకొండపల్లి: మనీ సర్క్యులేషన్ సిస్టమ్ నిర్వాహకుడు, మండలంలోని మంగాపురం తండాకు చెందిన వీరన్నను రెండు రోజుల క్రితం అదుపులోకి తీసుకున్న పోలీసులు క్షేత్రస్థాయిలో విచారణ ప్రారంభించారు. వీరన్న సహా పలువురు ఏర్పాటుచేసిన సంస్థ ద్వారా వేలాది మంది ప్రజల నుంచి డబ్బు వసూలు చేసినట్లు సమాచారం. ఈ మేరకు ఆయన ఫోన్‌లోని నంబర్ల ఆధారంగా ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఏజెంట్లు ఎందరు, ఎవరెవరు పెట్టుబడి పెట్టారనే అంశంపై దృష్టి సారించారు. అయితే, బాధితులు వేలల్లో ఉన్నా కేవలం ఒక్కరే పోలీసులను ఆశ్రయించారు. కాగా, నేలకొండపల్లి, ముదిగొండ, కూసుమంచి, సూర్యాపేట జిల్లాలోని పలు మండలాలకు చెందిన వారు ఏజెంట్లుగా ఉన్నట్లు తెలుస్తుండగా అందరి వివరాలు సేకరిస్తున్నారు. అయితే, ఈ విషయమై వివరాలు ఆరా తీసేందుకు యత్నించగా పోలీసులు స్పందించలేదు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

ఇల్లెందు: మండలంలోని ఈర్యాతండాకు చెందిన బి.రవికుమార్(28) ఈనెల 23వ తేదీన మద్యంమత్తులో పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నం చేయగా.. గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. మంగళవారం ఖమ్మంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి అన్న వెంకటేష్ ఫిర్యాదు మేరకు సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడు..

- పొలం దున్నుతున్న తండ్రీకుమారులు
- తండ్రి నడుపుతున్న క్రమంలో ప్రమాదం



మోజేజ్ (ఫైల్)

జూలూరుపాడు: తండ్రీకొడుకు కలిసి తమ పొలాన్ని పంటల సాగుకు సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇద్దరూ కాసేపు చొప్పున ట్రాక్టర్‌తో దున్నుతుండగా.. తండ్రి నడుపుతున్న సమయంలో ప్రమాదవశాత్తు ఢీకొట్టగా కుమారుడు మృతి చెందిన విషాద ఘటన ఇది. మండలంలోని వినోభానగర్‌కు చెందిన గంగావత్ రాము, ఆయన కుమారుడు మోజేజ్(20) ఓ రైతు ట్రాక్టర్‌ను తీసుకొచ్చి రెండు రోజులుగా తమ పొలాన్ని దున్నుతున్నారు. మంగళవారం కూడా పనుల్లో నిమగ్నం కాగా.. తండ్రి రాము కొడుకును కిందకు దించి ట్రాక్టర్ నడుపుతున్నారు. ఈక్రమంలో ట్రాక్టర్ కల్టివేటర్‌కు రాళ్లు అడ్డుగా రావడంతో వాటిని తొలగించే క్రమాన ఆయన వేగం పెంచాడు. దీంతో ట్రాక్టర్ దూసుకెళ్లి చెట్టు కింద ఉన్న మోజేజ్‌ను ఢీకొట్టింది. కంగారులో తండ్రి మరోసారి ఢీకొట్టడంతో మోజేజ్ తీవ్రంగా గాయపడగా.. కుటుంబసభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మోజేజ్ తుదిశ్వాస విడవగా కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

గుర్తు తెలియని యువతి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని యువతి మృతదేహం

చర్ల: అనుమానాస్పద స్థితిలో ఓ యువతి మృతదేహం చర్ల శివారు వెంకటాపురం మార్గంలో మంగళవారం లభ్యమైంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. చర్ల నుంచి వెంకటాపురంకు వెళ్లే మార్గంలో గుర్తు తెలియని ఓ మహిళ మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు వెళ్లి చూడగా.. సుమారు 27 ఏళ్ల గల యువతి నోరు, ముక్కులో నుంచి తెల్లటి నురగలు వచ్చి చనిపోయి ఉంది. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని భద్రాచలంలోని ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. కాగా, మృతురాలి ఒంటిపై నావీ బ్లూ టాప్, క్రీం కలర్ యాంకిల్ (ప్యాంటు) ధరించి ఉందని, వివరాలు తెలిస్తే 87126 82111, 87126 82114 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు.

ప్రజల గొంతును గుర్తించండి

స్పీకర్ అయ్యన్నపాత్రుడికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లేఖ

ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించేందుకు వైఎస్సార్‌సీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించాలి

సాక్షి, అమరావతి: ప్రజా సమస్యలను చట్టసభల్లో బలంగా వినిపించేందుకు ప్రతిపక్ష హోదా ఉండాల్సిందేనని, ఈ విషయంలో పరిశీలన చేయాలని కోరుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం లేఖ రాశారు. ప్రతిపక్ష పార్టీగా గుర్తింపుతో సభా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు చట్టబద్ధమైన భాగస్వామ్యం లభిస్తుందన్నారు. ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే 10 శాతం సీట్లు సాధించాలని చట్టంలో ఎక్కడా లేదన్నారు. విపక్ష పార్టీల్లో ఎవరికి ఎక్కువ సీట్లు ఉంటే వారికే ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలని చట్టంలో నిర్వచించారని పేర్కొన్నారు. శాసనసభలో కూటమి పార్టీల ఉద్దేశపూర్వక చర్యలను సైతం లేఖలో ప్రస్తావించారు. వైఎస్ జగన్ లేఖలో ముఖ్యాంశాలు ఇవీ..

శత్రుత్వాన్ని ప్రదర్శిస్తున్నారు..

మంత్రుల తర్వాత నాతో ప్రమాణం చేయించడం సంప్రదాయాలకు పూర్తి విరుద్ధం. ప్రధాన ప్రతిపక్ష నాయకుడి గుర్తింపు ఇవ్వకూడదని ముందుగానే నిర్ణయించినట్లు దీనిద్వారా కనిపిస్తోంది. విపక్షంలో ఎవరికి ఎక్కువ సీట్లు ఉంటే వారికే ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలని చట్టంలో నిర్వచించారు. ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే పది శాతం సీట్లు సాధించి ఉండాలని చట్టంలో ఎక్కడా లేదు. పార్లమెంట్‌లోగానీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోగానీ ఈ నిబంధన పాటించలేదు. అధికార కూటమి, స్పీకర్ ఇప్పటికే నాపట్ల శత్రుత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. చచ్చేదాకా కొట్టాలంటూ స్పీకర్ చేసిన వ్యాఖ్యలు వీడియోల ద్వారా బయటపడ్డాయి. ఇలాంటి పరిస్థితుల్లో అసెంబ్లీలో గొంతు విప్పే అవకాశాలు కనిపించడం లేదు. అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా గుర్తింపుతోనే ప్రజా సమస్యలను బలంగా వినిపించే ఆస్కారం ఉంటుంది. ప్రతిపక్ష పార్టీగా గుర్తింపుతో సభా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు చట్టబద్ధమైన భాగస్వామ్యం లభిస్తుంది. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని నా లేఖను పరిశీలించాలని కోరుతున్నా.

అంతరంగం అప్పుడే అర్థమైంది..

ఈనెల 21న అసెంబ్లీలో జరిగిన ఎమ్మెల్యేల ప్రమాణం కార్యక్రమాన్ని పరిశీలిస్తే నాకు ప్రధాన ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వరనే అభిప్రాయం కలిగింది. అసెంబ్లీ సంప్రదాయాల ప్రకారం ముందుగా సభా నాయకుడు, తర్వాత ప్రతిపక్ష నాయకుడు, అనంతరం మంత్రులు ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉండగా అలా జరగలేదు. సంప్రదాయాలకు విరుద్ధంగా మంత్రుల తర్వాతే నాతో ప్రమాణం చేయించారు. నాకు ప్రధాన ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వకూడదనే నిర్ణయాన్ని మీరు ముందుగానే తీసుకున్నట్లు కనిపిస్తోంది.

చట్టంలో స్పష్టంగా ఉంది..

ప్రధాన ప్రతిపక్ష పార్టీ, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు అంటే ఎవరనే విషయాన్ని చట్టంలో స్పష్టంగా పొందుపరిచారు. 'ఆంధ్రప్రదేశ్ పేమెంట్ ఆఫ్ శాలరీస్ అండ్ పెన్షన్ అండ్ రిమూవల్ ఆఫ్ డిస్‌క్వాలిఫికేషన్ యాక్ట్ 1953 చట్టం 12 ఆ' ప్రధాన ప్రతిపక్ష పార్టీ అంటే ఎవరనే విషయాన్ని స్పష్టంగా నిర్వచించింది. విపక్షంలో ఉన్న పార్టీల్లో ఎవరికి ఎక్కువ సంఖ్యా బలం ఉంటే వారికే ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలని చట్టం చెబుతుంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎన్నికలకు ముందే పొత్తు పెట్టుకుని సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినందున విపక్షంలో ఉన్న ఏకైక పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమే. కానీ జూన్ 21న జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని చూస్తే వైఎస్సార్‌సీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించడం, పార్టీ శాసనసభా పక్ష నాయకుడిగా నన్ను ప్రతిపక్ష నాయకుడిగా గుర్తించడంలో మీ ఉద్దేశాలేమిటో బయటపడ్డాయి. కానీ చట్టాన్ని పరిశీలిస్తే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వడంలోగానీ, పార్టీ శాసనసభా పక్షనేత అయిన నన్ను ప్రధాన ప్రతిపక్ష నేతగా స్పీకర్ గుర్తించేందుకుగానీ ఎలాంటి సందిగ్ధతకు తావులేదు. ఇటీవల స్పీకర్ చేసిన వ్యాఖ్యలు యూట్యూబ్ ఛానళ్లలో ఉన్నాయి. ఓడిపోయాడుగానీ చావలేదు.. చచ్చేవరకూ కొట్టాలి..! అంటూ నన్ను ఉద్దేశించి గౌరవ స్పీకర్ అన్న మాటలు ఆ వీడియోల్లో ఉన్నాయి. తద్వారా నాపై ఉన్న శత్రుత్వాన్ని స్పీకర్ రూపంలో అధికార కూటమి వ్యక్తం చేసింది.

వైఎస్సార్ సీపీ 40 శాతం ఓట్లను సాధించింది..

ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 40 శాతం ఓట్లను సాధించింది. ప్రజా సంబంధిత అంశాలపై అసెంబ్లీలో ప్రజల తరఫున ప్రాతినిధ్యం వహించాల్సిన బాధ్యత మాపై ఉంది. అయితే ప్రభుత్వం, స్పీకర్ శత్రుత్వ వైఖరిని ప్రదర్శిస్తున్న నేపథ్యంలో మా పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వకుంటే అసెంబ్లీ కార్యకలాపాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని కట్టడి చేస్తున్నట్లే అవుతుంది. వైఎస్సార్ సీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వడం వల్ల అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడికి తగిన సమయం లభిస్తుంది. దీనివల్ల ప్రజా సంబంధిత అంశాలను సభ దృష్టికి బలంగా తేగలుగుతారు. సభా కార్యక్రమాల్లో ముమ్మరంగా పాల్గొనేలా, ప్రభుత్వ విధానాలపై ప్రతిపక్ష పార్టీగా అభిప్రాయాలను చెప్పేలా చట్టబద్ధమైన భాగస్వామ్యం ప్రధాన ప్రతిపక్ష పార్టీకి లభిస్తుంది. ఇలాంటి పరిస్థితి లేకపోతే అసెంబ్లీలో అధికార కూటమి గొంతు మాత్రమే వినిపిస్తుంది. వివిధ అంశాల్లో బలమైన చర్చలు జరిగే అవకాశం కనిపించదు.

ఉపేంద్ర, పీజేఆర్‌ను ప్రధాన ప్రతిపక్ష నేతలుగా గుర్తించారు..

అసెంబ్లీలో 10 శాతం సీట్లు రానందున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శాసన సభా పక్షానికి ప్రధాన ప్రతిపక్ష హోదా లభించదనే చర్చ జరుగుతోంది. అయితే రాజ్యాంగంలోని ఆర్టికల్ 208 కింద ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ నోటిఫై చేసిన సభా ప్రవర్తనా నియమావళిలో నిర్దిష్ట సీట్లు వస్తేనే ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించాలనే విషయాన్ని ఎక్కడా చెప్పలేదనే విషయాన్ని మీ ముందుకు తెస్తున్నా. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎక్కడా ఈ నిబంధన పాటించలేదనే అంశాన్ని గుర్తు చేస్తున్నా. లోక్‌సభకు 1984లో 543 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో టీడీపీ 30 ఎంపీ సీట్లను గెలుచుకుంది. సభలో 10 శాతం సీట్లు సాధించనప్పటికీ నాడు టీడీపీకి చెందిన పర్వతనేని ఉపేంద్రను ప్రధాన ప్రతిపక్ష నేతగా గుర్తించారు. 1994 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో 294 సీట్లకుగానూ కాంగ్రెస్ 26 సీట్లు మాత్రమే సాధించింది. 10 శాతం సీట్లు కాంగ్రెస్‌కు దక్కనప్పటికీ పి.జనార్దన్‌రెడ్డిని నాడు ప్రధాన ప్రతిపక్ష నేతగా గుర్తించారు.

3 సీట్లు వచ్చిన బీజేపీకి సైతం..

2015 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 70 స్థానాలకుగానూ బీజేపీ కేవలం 3 సీట్లు సాధించినప్పటికీ ఆ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇచ్చారు. ఈ అంశాలన్నీ కూడా కేవలం ప్రజా ప్రయోజనాల రీత్యా మీ దృష్టికి తెస్తున్నా. ప్రజల తరఫున అసెంబ్లీలో గొంతు విప్పడానికి తగిన సమయం లభించాలనే ఉద్దేశంతో మీకు ఈ లేఖ రాస్తున్నా. అయితే ఇలాంటి పరిస్థితికి ఆస్కారం లేకుండా అధికార కూటమి ఇప్పటికే శత్రుత్వాన్ని ప్రదర్శిస్తోంది. ఈ నేపథ్యంలో నేను సభలో మాట్లాడాలనుకుంటే అది భారీ మెజార్టీ సాధించిన అధికార కూటమి దయమీద, నన్ను చచ్చేవరకూ కొట్టాలన్న స్పీకర్ గారి విచక్షణ మీదే ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం సభలో ఉన్న పార్టీల సంఖ్యా బలాలను దృష్టిలో ఉంచుకుని ఈ లేఖను పరిశీలించాలని కోరుతున్నా.

ఏపీలో ఆ చానళ్ల ప్రసారాలు వెంటనే పునరుద్ధరించండి

'సాక్షి' సహా పలు చానళ్ల ప్రసారాలు నిలిపివేతపై కేబుల్ ఆపరేటర్లకు ఢిల్లీ హైకోర్టు ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో నిలిపివేసిన చానళ్ల ప్రసారాలను తక్షణమే పునరుద్ధరించాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. జూన్ 6 నుంచి ఏపీలో సాక్షి, టీవీ9, ఎన్‌టీవీ, 10టీవీ ప్రసారాలను నిలిపివేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ మిని పుష్కర్ణ మంగళవారం విచారించారు. ఆయా చానళ్లను పునరుద్ధరించాలని కేబుల్ ఆపరేటర్లను ఆదేశించారు. లిఖితపూర్వక ఆదేశాలు ఇంకా వెబ్‌సైట్‌లో పొందుపరచాల్సి ఉంది. ఢిల్లీ హైకోర్టు నిర్ణయంపై న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్ ఫెడరేషన్ (ఎన్‌బీఎఫ్) హర్షం వ్యక్తం చేసింది. ఏపీలో ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా తీసుకొన్న నిర్ణయంపై కొరడా లాంటి ఆదేశాలుగా అభివర్ణించింది. 'ప్రజాస్వామ్య పనితీరుకు అవసరమైన బహిరంగ, పారదర్శక మీడియా వాతావరణాన్ని నిర్వహించే ప్రాముఖ్యతను హైకోర్టు జోక్యం నొక్కి చెబుతోంది. ఈ తీర్పు పత్రికా స్వేచ్ఛను సమర్థించడం, జర్నలిస్టుల హక్కులను పరిరక్షించడంపై ఓ ఉదాహరణగా నిలుస్తుంది' అని మంగళవారం ఎన్‌బీఎఫ్ ఓ ప్రకటనలో తెలిపింది.

రైతు భరోసాకు పదెకరాలు పరిమితి పెట్టండి

▶ మొదటి పేజీ తరువాయి

బ్యాంకులకు ఆదాయ పన్ను స్టేట్‌మెంట్లు చూపించాల్సి వస్తుందని.. కాబట్టి ఆదాయ పన్ను చెల్లించేవారికి కూడా రైతుభరోసా ఇవ్వాలని సూచించారు. ప్రతీ వారం నిర్వహించే 'రైతు నేస్తం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు 'రైతు భరోసా'పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు పలు అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. కొండలు, గుట్టలు, రియల్ ఎస్టేట్ భూములు వంటి వాటికి రైతు భరోసాను నిలిపివేయాలని కోరారు.

దొడ్డు రకాల వరికీ బోనస్ ఇవ్వాలి

సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం చెప్పిన నేపథ్యంలో.. చాలా మంది రైతులు దొడ్డు రకం వరికి కూడా బోనస్ ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో దొడ్డు వరి సాగు చేసేవారే ఎక్కువని, వారికీ బోనస్ ఇస్తేనే గిట్టుబాటు ధర లభిస్తుందని పేర్కొన్నారు. సన్న రకాలకు ఎటూ డిమాండ్ ఉంటుందని.. మార్కెట్లోనూ మద్దతు ధర కంటే ఎక్కువగా రేటు పలుకుతుందని వివరించారు. ఇక సీజన్ సమయంలో పంటల సాగుకు అవసరమైన కూలీల కొరత ఉంటుందని.. దొరికినా ఖర్చు ఎక్కువ అవుతుందని అనేక మంది రైతులు వాపోయారు. అందువల్ల వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. దాదాపు ఐదేళ్లుగా వ్యవసాయ యంత్రాల సరఫరా నిలిచిపోయిందని, దాంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

రైతుబంధుతో రూ.25,670 కోట్లు వృథా: మంత్రి తుమ్మల

గతంలో సాగులో లేని భూములకు కూడా రైతు బంధు వర్తింపజేసి.. 12 విడతల్లో దాదాపు రూ.25,670 కోట్ల ప్రజాధనం వృథా చేశారని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆరోపించారు. 93 శాతం వాటా ఉన్న సన్న, చిన్నకారు రైతుల వాటా రైతుబంధు మొత్తంలో 68 శాతం కూడా లేదని.. దానికితోడు 17.5 శాతం ఉన్న కౌలు రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం రైతుబంధు స్థానంలో రైతుభరోసా పథకాన్ని తీసుకొస్తోందని, పెట్టుబడి సాయాన్ని ఎకరానికి రూ.15 వేలకు పెంచుతున్నామని చెప్పారు. అయితే రైతుబంధు తరహాలో ప్రజా ధనం వృథా కాకుండా ఉండేలా పటిష్ట విధానాల రూపకల్పనకు తమ ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. రైతునేస్తం కార్యక్రమంలో రైతులు వెల్లడించిన, రాత పూర్వకంగా సేకరించిన సూచనలను క్రోడీకరించి నివేదిక తయారు చేయాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపిని మంత్రి ఆదేశించారు. తమ ప్రభుత్వం రైతుభరోసాకు సంబంధించి ఎటువంటి విధానపరమైన నిర్ణయాలు ఇంకా తీసుకోలేదని.. పూర్తిగా అందరి అభిప్రాయాలు తీసుకున్నాక, శాసనసభలో చర్చించాక పథకాన్ని తీసుకొస్తామని చెప్పారు. అలస్యమైనప్పటికీ అర్హులకు మాత్రమే అందేలా రైతుభరోసాకు రూపకల్పన చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, రైతుసంఘం నాయకుడు అన్వేశ్‌రెడ్డి, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసాపై రైతులతో మాట్లాడండి

రాష్ట్రవ్యాప్తంగా అభిప్రాయ సేకరణ జరపండి: డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రైతు భరోసా పథకాన్ని ఎలా అమలు చేయాలో రైతుల్నే అడిగి తెలుసుకోవా లని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యవసాయ అధికారులకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతుల నుంచి అభిప్రాయ సేకరణ జరపాలని ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖల అధికారులతో బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి మాట్లాడుతూ 'రైతు భరో సా'పై రైతుల అభిప్రాయం ఎలా ఉంది? ఈ పథ కం అమల్లో ఎలా ముందుకెళ్లాలో వారిని అడిగి తెలుసుకుంటేనే మంచిదని అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించి మంత్రులు కూడా హాజరయ్యేలా చూడాలని సూచించారు. అసలు తెలంగాణ ఏర్పాటు కాకముందు రైతుల కోసం అమల్లో ఉన్న పథకాలేంటి? గత ప్రభుత్వ హయాంలో నిలిపివేసిన పథకాలేంటి? అందుకు గల కారణాలేంటి? తదితర వివరాలను కూడా అందజేయాలని వ్యవసాయాధికా రులను ఆదేశించారు. రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధికి తగిన బడ్జెట్ ప్రతిపాద నలు సమర్పించాలని సూచించారు. సమావేశంలో భాగంగా రాష్ట్రంలో అమల్లో ఉన్న నేతన్న చేయూత, నేతన్న బీమా పథకాల్లో కేంద్ర ప్రభుత్వ వాటా గురించి చర్చించారు. రాష్ట్ర విభజన తర్వాత చేనేత కార్మికుల జీవితాల్లో ఎలాంటి మార్పులు వచ్చాయో నివేదిక ఇవ్వాలని డిప్యూటీ సీఎం సంబంధిత అధికారు లను ఆదేశించారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవా లని కోరారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ మ్యాచింగ్‌తో అమలయ్యే పథకాలకు సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తా నియా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

వచ్చే నెల 11న గిరిజన ఉత్పత్తుల ఎంపిక

భద్రాచలంటౌన్: గిరిజనులు రూపొందిస్తున్న ఉత్పత్తులను అమ్మకానికి ఎంపిక చేయడంతో ధర ఖరారు చేసేందుకు వచ్చేనెల 11న సమావేశం నిర్వహిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ జితేష్ వి.పాటిల్ ఓ ప్రకటనలో తెలిపారు. గిరిజనులు తయారు చేసే అటవీ ఉత్పత్తులతో పాటు చేనేత ఉత్పత్తులను దేశ వ్యాప్తంగా 120 ట్రైఫెడ్ కేంద్రాల ద్వారా విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపిక చేసిన వాటికి ట్రైఫెడ్ ద్వారా ధర ప్రకటిస్తారని తెలిపారు. ఈకార్యక్రమానికి 50 కిలోమీటర్ల దూరంలోపు నుంచి వచ్చే వారికి రూ.350, 50 కిలోమీటర్లకు పైగా దూరం నుంచి వచ్చే వారికి రూ.500 చొప్పున రవాణా ఖర్చులు చెల్లించడమే కాక భోజన సౌకర్యం కల్పించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్న గిరిజనులు ఉత్పత్తుల నమూనాలతో జూలై 11న ఐటీడీఏ ఆవరణలోని గిరిజన భవన్‌లో జరిగే కార్యక్రమానికి కుల ధ్రువీకరణ పత్రం, రేషన్, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు 97054 99248, 98485 22841,77949 21516 నంబర్లలో సంప్రదించాలని ఇన్‌చార్జ్ పీఓ తెలిపారు.

ప్రయాణికులకు ఇబ్బందులు రాకుండా చూడాలి



కొత్తగూడెం బస్టాండ్‌లో పరిశీలిస్తున్న ఆర్‌ఎం, అధికారులు

మంచుపల్లి: ఆర్టీసీ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఖమ్మం రీజనల్ మేనేజర్ ఎ.సరిరామ్ ఆదేశించారు. కొత్తగూడెం బస్టాండ్‌తో పాటు డిపోలోని పలు విభాగాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. బస్టాండ్‌లో షాపుల నిర్వహణ, ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, మరుగుదొడ్ల వినియోగంపై సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం డిపోలో సిబ్బంది, బస్సుల పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ డిపోల అభివృద్ధికి పాటుపడాలని, రద్దీ రూట్లలో ఎక్కువ సర్వీసులను నడపాలని సూచించారు. డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు, అధికారులు శ్రీనివాసరావు, శ్రావణ్‌కుమార్, సునీత తదితరులు పాల్గొన్నారు. ఆతర్వాత కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్‌ను ఆర్‌ఎం సరిరామ్ మర్యాదపూర్వకంగా కలిశారు.

మూషిక జింకల సంతతి అంతంతే..

- కిన్నెరసాని అభయారణ్యంలో పెరగని జీవాల సంఖ్య
- ఆరేళ్ల కిందట హైదరాబాద్ నుంచి తీసుకొచ్చిన అధికారులు
- తొమ్మిదింటిని తీసుకొస్తే రెండు పిల్లలకు జననం
- ఈ ఏడాది రెండు మృత్యువాత



ఆస్ట్రేలియా నుంచి తెప్పించి పెంచుతున్న లెమన్‌గ్రాస్ (ఇన్‌సెట్) కిన్నెరసాని అభయారణ్యంలో పెరుగుతున్న మూషిక జింక



కూరగాయ ముక్కలు తింటున్న మూషిక జింకలు

పాల్వంచరూరల్: ఎలుక మూతిని పోలి ఉండే జింక జాతికి చెందిన మూషిక జింకలు జిల్లా వాతావరణాన్ని తట్టుకోలేకపోతున్నాయి. దీంతో అధికారులు ఆశించినట్లుగా వాటి సంతతి పెరగడం లేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కిన్నెరసాని అభయారణ్యంలో అటవీశాఖ అధికారులు ప్రయోగాత్మకంగా ఆరేళ్ల కిందట మూషిక జింకలను వదిలారు. రూ.లక్షలు వెచ్చించి వీటిని కంటికి రెప్పలా కాపాడుతూ, కావాల్సిన ఆహారం సమకూరుస్తుండగా, సంతతి క్రమంగా పెరుగుతుందనుంటే తగ్గుతుండడం శోచనీయం. అయితే, ఇక్కడి వాతావరణాన్ని మూషిక జింకలు తట్టుకోలేకపోవడం ఓ కారణమని తెలుస్తుండగా.. వీటి జీవితకాలమే తక్కువగా ఉంటుందని మరికొందరు చెబుతున్నారు.

2018లో ఇక్కడకు..

అంతరించిపోతున్న జీవాల జాబితాలో ఉన్న మూషిక జింకల సంతతిని పెంచాలని కేంద్ర జూ అథారిటీ నిర్ణయించింది. ఇందులో భాగంగా 2010 మార్చిలో హైదరాబాద్‌లోని నెహ్రూ జూ పార్క్‌లో మూషిక జింకల పునరుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసి అక్కడ సంతతి పెంపునకు కృషి చేస్తున్నారు. ఆపై అనేక జీవజాతులకు ఆలవాలంగా ఉన్న రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు కిన్నెరసాని అభయారణ్యాన్ని కూడా ఎంచుకున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని జూ పార్క్ నుంచి 2018లో తొమ్మిది మూషిక జింకలను ఇక్కడకు తీసుకొచ్చారు. కిన్నెరసాని అభయారణ్యం పరిధి సంపత్‌నగర్ అటవీ ప్రాంతంలో ఒకటి మగ, మూడు ఆడ మూషిక జింకలను వదిలారు. అలాగే, కిన్నెరసాని డీర్ పార్కులో ఐదు మూషిక జింకలను వదిలారు. కొన్నాళ్లు వీటిని బోన్లలో ఉంచి కావాల్సిన ఆహారం సమకూరుస్తూ ఇక్కడి వాతావరణానికి అలవాటు పడేలా చేశారు. ఇంతలోనే సంపత్ నగర్‌కు తీసుకొచ్చిన ఆడ మూషిక జింకల్లో ఒకటి బిడ్డకు జన్మనిచ్చింది. దీంతో వీటి సంఖ్య ఐదుకు పెరగగా.. వాతావరణానికి అలవాటు పడిందన్న భావనతో అడవిలో వదిలేశారు. మరోపక్క కిన్నెరసానిలోని డీర్ పార్కులో వదిలిన ఐదు మూషిక జింకల్లోనూ ఒకటి జింకకు జన్మనిచ్చింది. దీంతో వీటి సంఖ్య ఆరుకు పెరగడంతో అధికారులు సంతోషించారు. కానీ ఇందులో గత జనవరిలో ఒకటి, ఈ నెల7వ తేదీన ఒక మూషిక జింక మృతి చెందడం గమనార్హం. ఫలితంగా జిల్లాకు తీసుకొచ్చిన తొమ్మిది మూషిక జింకల సంతతి 11కు పెరిగినా రెండు కన్నుమూయడంతో మళ్లీ వాటి సంఖ్య తొమ్మిదికి పడిపోయింది.

ప్రత్యేక ఆహారం

జింకల సంతతిలో అతి చిన్నదైన మూషిక జింక ఎలుక లక్షణాలు కలిగి ఉంటుంది. వీటి పిల్లలు పుట్టిన ఐదు నెలలకే పరిణతి చెందుతాయి. ఆపై గర్భం దాల్చి బిడ్డకు జన్మనిస్తాయి. అయితే, వీటి జీవితకాలం ఐదు నుంచి ఆరేళ్ల వరకే ఉంటుందని తెలుస్తోంది. అందుకే జిల్లాకు తీసుకొచ్చిన మూషిక జింకలు మృతి చెందుతున్నాయనే వాదన ఉండగా.. వాతావరణం పడకపోవడమూ కారణమని ఇంకొందరు చెబుతున్నారు. కాగా, వీటిని కిన్నెరసాని అభయారణ్యానికి తీసుకొచ్చాక ఆహారంగా క్యారెట్, కీర, బీన్స్, దోసకాయల ముక్కలు వేశారు. ఇలా నెలకు రూ.9 వేల చొప్పున ఏటా రూ.1.88 లక్షలు వెచ్చించారు. ఇక ఆరేళ్ల కాలంలో రూ.6.48 లక్షల వరకు ఖర్చు చేసినట్లు అంచనా. అంతేకాక మూషిక జింకలు తినే లెమన్ గ్రాస్ (ఓ రకం గడ్డి)ను ఆస్ట్రేలియా నుంచి తెప్పించి పెంచుతున్నారు. ఇలా రకరకాల జాగ్రత్తలు తీసుకున్నా మూషిక జింకల సంతతి పెరగకపోవడం, ఉన్నవి కన్నుమూస్తుండడం వెనుక కారణాలపై అధికారులు అన్వేషిస్తున్నట్లు తెలిసింది.

ఇక్కడి వాతావరణం తట్టుకోలేక..



అంతరించి పోతున్న మూషిక జింకల సంతతిని పెంచేందుకు జిల్లాను ఎంపిక చేశారు. కిన్నెరసాని అభయారణ్యంలో వీటి పిల్లలను తీసుకొచ్చి పెంచుతున్నాం. తొలుత వాతావరణం విషయంలో అనుమానాలు ఉన్నా సంతతి పెరగడంతో తట్టుకున్నాయని భావించాం. కానీ ఇటీవల రెండు మూషిక జింకలు మృతి చెందడంతో అనుమానాలు వస్తున్నాయి. ప్రస్తుతానికి పర్యాటకులకు కనిపించేలా ఇనుప కంచెల్లో వీటిని ఉంచి సంరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

–బి.బాబు, వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ

పామాయిల్ ఫ్యాక్టరీలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు



యంత్రాలను పరిశీలిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

దమ్మపేట: అశ్వారావుపేటలోని ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థులు దమ్మపేట మండలం అప్పారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీని మంగళవారం సందర్శించారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల సందర్శనలో భాగంగా వచ్చిన విద్యార్థులు గెలల క్రషింగ్, యంత్రాల పనితీరు, విద్యుత్ ప్లాంట్ పరిశీలించి పనితీరును తెలుసుకున్నారు. ఈసందర్భంగా వారికి ఫ్యాక్టరీ వివరాలను మేనేజర్ కళ్యాణ్‌గౌడ్ వివరించారు. కాగా, క్షేత్ర స్థాయి పరిశీలనతో అనుభవం పెరగనున్న నేపథ్యాన విద్యార్థులను తీసుకొచ్చినట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంతకుమార్ తెలిపారు. అధ్యాపకులు డాక్టర్ శిరీష, డాక్టర్ గోపాలకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో ఉద్యోగాల మేళా

- ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు నోటిఫికేషన్ల జారీ
- మొదటి నోటిఫికేషన్‌కు పూర్తయిన దరఖాస్తుల స్వీకరణ
- ఈసారి ఆన్‌లైన్‌లో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు



సింగరేణి ప్రధాన కార్యాలయం

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణకు మణిహారంగా నిలుస్తూ ఆరు జిల్లాల్లో విస్తరించి ఉన్న సింగరేణి సంస్థలో ఉద్యోగాల భర్తీకి వరుస నోటిఫికేషన్లు వస్తున్నాయి. ఇటీవలే ఎక్స్‌టర్నల్ అభ్యర్థులకు సంబంధించి 600, ఇంటర్నల్ అభ్యర్థులకు 1,241 పోస్టులతో నోటిఫికేషన్లను విడుదలయ్యాయి. ఇందులో ఎగ్జిక్యూటివ్(అధికారుల కేడర్) పోస్టులు 305 ఉండగా.. నాన్ ఎగ్జిక్యూటివ్(కార్మికుల కేడర్)లో 295 పోస్టులు ఉన్నాయి. ఇక ఇంటర్నల్ పోస్టుల్లోనూ 156 పోస్టులు ఎగ్జిక్యూటివ్ మినహా మిగతావి నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులతో యాజమాన్యం ఫిబ్రవరిలో నోటిఫికేషన్లు విడుదల చేసింది. కాగా, మొదటి నోటిఫికేషన్‌లో గడువు ముగిసే నాటికి పది 10 రకాల పోస్టులకు సుమారు 15వేల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు.

గడిచిన పదేళ్లలో ఇలా...

సింగరేణి సంస్థ గడిచిన పదేళ్లలో విడుదల చేసిన 58 ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ల ద్వారా 4,207 ఉద్యోగాలు భర్తీ చేసింది. అలాగే, 15,256 డిపెండెంట్ ఉద్యోగాల నియామకం చేపట్టింది. ఇవికాక సంస్థలో పనిచేసే అభ్యర్థుల(ఇంటర్నల్)కోసం 109 నోటిఫికేషన్లతో 3,490 ఉద్యోగాలకు పదోన్నతి కల్పించింది. తద్వారా ఖాళీలు ఏర్పడడంతో కొత్త నియామకాలకు అవకాశం ఏర్పడింది.

తొలిసారిగా ఆన్‌లైన్‌లో...

బొగ్గు ఉత్పత్తిలో రారాజుగా విరాజిల్లుతున్న సింగరేణి సంస్థ ఉద్యోగ నియామకాల్లో పరీక్ష జరిగిన రోజే ఫలితాలు వెల్లడించడం ఆనవాయితీగా వస్తోంది. తద్వారా పైరవీలకు తావు లేకపోగా పూర్తిస్థాయి పారదర్శకత ఉంటోంది. అయితే, రానురాను సింగరేణిలో ప్రభుత్వం, కొందరు ప్రజాప్రతినిధుల జోక్యంతో రిక్రూట్‌మెంట్ సెల్ అభాసు పాలవుతోంది. ఈ చెడ్డపేరు పోగొట్టుకోవడానికి తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్ల ఆధారంగా పరీక్షల నిర్వహణ బాధ్యతను ఢిల్లీలోని ఎడ్‌సెల్ సంస్థకు అప్పగించింది. ఈ సంస్థ హైదరాబాద్‌తోపాటు ఇతర పట్టణాలలో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. 134ఏళ్ల చరిత్ర కలిగిన సింగరేణి తొలిసారి ఉద్యోగాల భర్తీకి ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనుండడం విశేషం.

మెరిట్ అభ్యర్థులకు న్యాయం జరగాలి



సింగరేణి సంస్థ పరీక్ష జరిగిన రోజే ఫలితాలను విడుదల చేసే విధానానికి శ్రీకారం చుట్టింది. అయితే, ఇటీవల సంస్థ పేరు అభాసుపాలైంది. దీంతో నిర్వహణ బాధ్యతలు ఇంకో సంస్థకు అప్పగించడం బాగుంది. అయితే, పరీక్షలకు సంబంధించి సిలబస్ కూడా ఇస్తే చదువుకోవడానికి వీలయ్యేది.

– వంశీకృష్ణ, ఈఅండ్ఎం అభ్యర్థి

పారదర్శకత కోసమే ఎడ్‌సెల్‌కు...



సింగరేణి రిక్రూట్‌మెంట్ సెల్‌పై అభ్యర్థులకు నమ్మకం కల్పించడం.. పారదర్శకత కోసమే ఈసారి పరీక్షల నిర్వహణ బాధ్యతను ఎడ్‌సెల్ సంస్థకు అప్పగించాం. పరీక్ష జరిగిన రోజే ఏ సంస్థ ఇవ్వని విధంగా సింగరేణి ఫలితాలను విడుదల చేస్తోంది. ఈసారి కూడా అదే ఒరవడి కొనసాగిస్తాం.

– ఎన్వీకే.శ్రీనివాస్, సింగరేణి డైరెక్టర్ (పా)

ఆసరా కాదు... చేయూత

వివిధ వర్గాల ప్రజలకు ప్రభుత్వం అందించే పింఛన్ పథకం ఇన్నాళ్లు 'ఆసరా' పేరిట కొనసాగింది. అయితే, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని చేయూతగా మార్చింది. దీంతో గత మూడు రోజుల నుంచి అధికారిక వెబ్‌సైట్‌లో ఆసరాకు బదులు చేయూతగా కనిపిస్తోంది.

– ఖమ్మంమయూరిసెంటర్



పెన్షన్ల వెబ్‌సైట్‌లో చేయూత పేరిట హోం పేజీ